క్లుప్తంగా

మెరుగైన దంత వైద్యసేవలందించండి



లబ్బీపేట(విజయవాడతూర్పు): సమాజంలో దంత సమస్యలున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పూర్వ ప్రత్యేక కార్యదర్శి జీఎస్ నవీన్‌కుమార్ అన్నారు. ఆయన వైద్యశాఖ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సమయంలో కోల్గేట్ సంస్థ నుంచి ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో ఆర్థోడాంషియా పీజీ విభాగానికి ఎనిమిది డెంటల్ చైర్స్‌ను అందించారు. వాటిని ఆ విభాగంలో ఇన్‌స్టాల్ చేయగా, శనివారం ఆ పీజీ విభాగాన్ని జీఎస్ నవీన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన దంత వైద్య సేవలను అందించాలనే దృక్పథంతో కోల్గేట్ సంస్థ ఎనిమిది డెంటల్ చైర్స్ అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరికీ సత్వర, మెరుగైనసేవలు అందించేందుకు ప్రతి వైద్యుడు కృషి చేయాలన్నారు. అనంతరం జీఎస్ నవీన్‌కుమార్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కోల్గేట్ సంస్థ నుంచి డెంటల్ చైర్స్ అందజేసేందుకు సహకరించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు డాక్టర్ మెహబూబ్ షేక్ పాల్గొన్నారు.

98.72 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



ఆటోనగర్(విజయవాడ తూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలోని 16వ డివిజన్‌లో 98.72 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. నాలుగు రోజుల నుంచి వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వేకువజామున తలుపు తట్టి వృద్ధులకు పింఛన్లు ఇచ్చారు. ఇక్కడ మొత్తం 1,097కి గాను 1,083 మందికి అందజేశారు. మిగతావారు అందుబాటులో లేకపోవడం వేరే గ్రామాలకు పనుల మీద వెళ్లిఉంటారని వార్డు అడ్మిన్ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతి సారీ సెంట్‌పర్సెంటేజ్ పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తున్నట్టు తెలిపారు.

ఎస్పీఎల్ క్రీడా స్ఫూర్తికి నిదర్శనం



విజయవాడ స్పోర్ట్స్: సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రీడా స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనమని ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్ అన్నారు. గత నెల 25 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన ఎస్పీఎల్ ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి క్రికెట్ సీనియర్స్ విభాగంలో లయోలా కాలేజీ జట్టు రన్నర్ ట్రోఫీని అందుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కాలేజీ యాజమాన్యం కాలేజీ క్రికెట్ జట్టును శనివారం అభినందించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సాక్షి మీడియా గ్రూప్ జిల్లా, రీజినల్, రాష్ట్ర స్థాయిల్లో ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా జట్లు రానున్న మరిన్ని టోర్నమెంట్లకు ప్రాతినిధ్యం వహించేందుకు ఎస్పీఎల్ దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా క్రికెట్ పోటీలు నిర్వహించిన సాక్షి యాజమాన్యానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ ఫాదర్ ఫ్రాన్సిస్‌జెవిఎల్, అసిస్టెంట్ డైరెక్టర్లు ఫాదర్ డి.బాలస్వామి, కె.రవీంద్రనాథ్, పీడీ వై.రాజేష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

కృష్ణలంక(విజయవాడతూర్పు): యువత మత్తు పదార్థాలకు బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని కృష్ణలంక పీఎస్ సీఐ ఎం.వి.దుర్గారావు అన్నారు. రాణిగారితోటలోని సాయికల్యాణి స్కూల్, విజయ బ్రిలియంట్ స్కూల్, బాలాజీ నగర్‌లోని మహితా పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు శనివారం ఆయన మాదకద్రవ్యాలు సేవించడం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ విద్యార్థులు, యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గంజాయి, ఏ విధమైన మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నా, సేవిస్తున్నా, అక్రమ రవాణా చేస్తున్న పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే డ్రైవింగ్ లేకుండా వాహనం నడపరాదన్నారు. ద్విచక్రవాహనదారుడు హెల్మెట్‌ను, కారు డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్‌బెల్టు ధరించి మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై కృష్ణసాయి, పోలీస్ సిబ్బంది, స్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌దే

పటమట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టి లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిదేనని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పేర్కొన్నారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 14వ డివిజన్ 245వ సచివాలయాల పరిధిలో చైత్ర స్కూల్ రోడ్, శాంతినగర్ ప్రాంతాల్లో నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లిన అవినాష్ ప్రభుత్వం ద్వారా వారి కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే మ్యానిఫెస్టోలో పొందుపరచిన 98 శాతం హామీలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని పేర్కొన్నారు. మేనిఫెస్టోని పారదర్శకంగా అమలు చేయడమే లక్ష్యంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి గడప వద్దకే అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ లబ్ధి అందజేస్తున్నారన్నారు. ప్రతి ఇంట్లో పెన్షన్, అమ్మఒడి, చేయూత లాంటి పథకాలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో జనరంజక పరిపాలన అందిస్తూ జగన్ ప్రజల మనసులో కొలువై ఉంటే, ప్రతిపక్ష టీడీపీ రాద్ధాంతాలు సృష్టించి, రాజకీయ పబ్బం గడుపుకుంటోందని ఆరోపించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ నగర్‌కు చెందిన గొత్రు పాండు కుమార్తె హాస్పిటల్ ఖర్చులకు రూ.5 వేలు దేవినేని చారిటబుల్ ట్రస్ట్ నుంచి అందించారు. కార్యక్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ చింతల సాంబయ్య, డివిజన్ అధ్యక్షుడు శెటికం దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు మరీదు ఉమ, చెక్క రోశయ్య, మహేష్, తిరుపతి, చిట్టిబాబు, సన్యాసి రావు, ప్రతాప్, విజయ్ పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న దేవినేని అవినాష్

అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పాలన

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): ప్రజా సంక్షేమంతో పాటు మౌలిక అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పేర్కొన్నారు. 4వ డివిజన్ పరిధిలోని గురునానక్ నగర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో నూతనంగా నిర్మించిన రోడ్లు ప్రారంభించి, కొత్త రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడంలో ప్రభుత్వం సఫలమైందన్నారు. సంక్షేమ పాలనతో పాటు ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించడంలో సీఎం జగన్ చొరవ తీసుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోందన్నారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని తెలిపారు. తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ పనులు శరవేగంగా పూర్తయ్యాయని చెప్పారు. ఒక్క 4వ డివిజన్‌లోనే సుమారు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలి ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా స్థానికుల అభ్యర్థన మేరకు సీటీఓ కాలనీ పార్కుకు తంగెళ్లమూడి భాస్కరరావు పార్కుగా నామకరణం చేసినట్లు తెలిపారు. అనంతరం పలు రోడ్లను లాంఛనప్రాయంగా ప్రారంభించి, 15 లక్షల నిధులతో నిర్మించే కొత్త రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 4వ డివిజన్ ఇన్‌చార్జి గల్లా పద్మావతి, కో ఆప్షన్ సభ్యులు సుబ్బారావు, ప్రసాద్, జెజె సింగ్, రవీంద్ర పాల్గొన్నారు.



రోడ్డును ప్రారంభిస్తున్న దేవినేని అవినాష్

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

పటమట(విజయవాడతూర్పు): కొండపావులూరులో నిర్మాణంలో ఉన్న జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కొండపావులూరు లేఅవుట్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణాల విషయంలో జాప్యం జరగకుండా స్పెషల్ ఆఫీసర్లు దృష్టి సారించి మౌలిక వసతుల పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. లేఔట్లలో అంతర్గత రోడ్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలను కల్పించాలన్నారు. ఈ పర్యటనలో స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురునాథ్, హౌసింగ్, యూసీడీ క్షేత్ర స్థాయి సిబ్బంది కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



కొండపావులూరు లే అవుట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

వలంటీర్ వ్యవస్థ కీలకం

గుణదల(విజయవాడ తూర్పు): ప్రజా సంక్షేమ పథకాలె ప్రజలకు చేరువ చేసేందుకు వాలంటీర్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రింగ్‌రోడ్డు సమీపంలోని ఎగ్జిక్యూటివ్ క్లబ్‌లో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు ప్రభుత్వ విధివిధానాలపై సమీక్ష సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల బాధ్యత కీలకమన్నారు. ప్రభుత్వ విధి విధానాలు, సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజలకు చేరువ చేసేందుకు వలంటీర్లు నిబద్ధతగా పనిచేయాలని కోరారు. ప్రజా సంక్షేమం కోసం సీఎం జగన్ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసేందుకు కృషి చేయాలన్నారు. మరో మూడు దశాబ్దాల పాటు ఆయనే మనకు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, ఎన్నికల పరిశీలకులు గుబ్బా చంద్రశేఖర్, కార్పొరేటర్లు కలపాల అంబేడ్కర్, భీమిశెట్టి ప్రవల్లిక, అంబడి పూడి నిర్మలాకుమారి పాల్గొన్నారు.

జీఓ నంబర్-1 రద్దు చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే జీఓ నంబర్-1 రద్దు చేయాలని ప్రజాసంఘాల, రాజకీయ పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆ జీఓ ను రద్దు చేయాలని కోరుతూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో వేదిక కన్వీనర్ ముప్పాళ్ల సుబ్బారావు అధ్యక్షతన శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పోరాట వేదిక కన్వీనర్ ఎస్.రాజేంద్రప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం నాయకుడు వెంకటేశ్వరరావు మాట్లాడారు.

నలందలో సాఫ్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాపు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, నాంది ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ సాఫ్ట్‌స్కిల్స్, ఇంటర్వ్యూ సిల్స్‌పై నలంద డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ఆరు రోజుల పాటు వర్క్‌షాపు నిర్వహించారు. నాంది స్కిల్స్ ట్రైనర్ డి.భవానీ విద్యార్థినిలకు కమ్యూనికేషన్ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్, సెల్ఫ్ ఇంట్రడక్షన్, రెజ్యూమ్‌ప్రిపరేషన్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ టిప్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సమావేశంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ ఈ వర్క్‌షాపు విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వారిలో నైపుణ్యాలు పెంపొందించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో సాఫ్ట్ స్కిల్స్ వలన కెరీర్‌లో వారు ఉన్నత స్థానానికి ఎదుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి చంద్రగిరి, ట్రైనర్ బి రజనీప్రదీప పర్యవేక్షించారు.



సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ పొందిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు

క్రికెట్‌లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రికెట్ గ్రౌండ్‌లో ఈ నెల రెండో తేదీన జరిగిన కృష్ణా-గుంటూరు ఇంటర్ స్కూల్స్ క్రికెట్ టోర్నమెంట్-2023లో తమ స్కూల్ విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు పొందారని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం స్కూల్ ఆవరణలో అభినందించారు. సీనియర్స్ విభాగంలో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా యర్రంశెట్టి ఆదిత్యఉదయ్, బెస్ట్ వికెట్ కీపర్‌గా హీత్ జైన్, జూనియర్ విభాగంలో బెస్ట్ వికెట్ కీపర్‌గా సందిరెడ్డి శౌర్యనారాయణ బహుమతులను పొందారన్నారు. మ్యాన్ ఆఫ్ ది సీరిస్‌గా కొంగర పూజిత్‌సాయి నిలిచాడని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు భీమారావుతో పాటుగా ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నూతన కార్యవర్గానికి అభినందనలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ది ఈఎస్‌ఐ డిస్పెన్సరీ స్టాఫ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులకు శనివారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ పూనూరి గౌతంరెడ్డి అభినందనలు తెలియజేశారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులను ఘనంగా సత్కరించారు. నూతనంగా ఎన్నికైన వారిలో అధ్యక్షుడిగా నాళం మురళీకృష్ణ(జీజీహెచ్), ఉపాధ్యక్షుడిగా సీహెచ్‌వీఆర్ ప్రసాద్(మలేరియాశాఖ), కార్యదర్శిగా పి. శ్రీనివాసరావు (ఈఎస్‌ఐ హాస్పిటల్), డైరెక్టర్లుగా ఎస్‌ఎన్ సత్యనారాయణరెడ్డి (ఆయుర్వేద ఆస్పత్రి), పి.జయకుమార్ (జీజీహెచ్), వి.చలపతిరావు (ఈఎస్‌ఐ డిస్పెన్సరీ), జి.రంగమ్మ(జీజీహెచ్)లు ఉన్నారు. వీరందరికీ పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించారు.



ఈఎస్‌ఐ డిస్పెన్సరీ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న గౌతంరెడ్డి

సంక్షిప్తం

వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేక ప్యాసింజర్ రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేక డైలీ ప్యాసింజర్ సర్వీసులు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. రాజమండ్రి-విశాఖపట్నం మధ్య 07466 నంబరు రైలు ఈ నెల 14 నుంచి రోజూ నడుస్తుందని తెలిపారు. ఈ రైలు ఉదయం 9.20 గంటలకు రాజమండ్రిలో బయలుదేరి, అదే రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 07467 నంబరుతో ఈ నెల 15 నుంచి రోజు సాయంత్రం 6.20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి, రాత్రి 11.35 గంటలకు రాజమండ్రి చేరుకుంటుంది. విశాఖపట్నం - విజయనగరం మధ్య 07468 నంబరు ఈ నెల 14 నుంచి రోజూ సాయంత్రం 6.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి, రాత్రి 7.50కి విజయనగరం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 07469 నంబరుతో ఈ నెల 15 నుంచి ఉదయం 6.10 గంటలకు విజయనగరంలో బయలుదేరి 7.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం-పలాస మధ్య 07470 నంబరు రైలు ఈ నెల 14 నుంచి రోజూ ఉదయం 7.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి, మధ్యాహ్నం ఒంటి గంటకు పలాస చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 07471 నంబరుతో మధ్యాహ్నం 1.30 గంటలకు పలాసలో బయలుదేరి, రాత్రి 7.50 గంటలకు విశాఖపట్నం చేరుతుంది.

రేపటి నుంచి విజయవాడ యూత్‌ఫెస్ట్

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలో ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు విజయవాడ యూత్‌ఫెస్ట్ నిర్వహించనున్నట్లు ఫెస్ట్ కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి విజయ్‌ప్రకాష్ తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో విజయవాడ యూత్‌ఫెస్ట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గాలకు బానిసవుతున్న నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, స్పోర్ట్స్ ద్వారా యువతను ఆకట్టుకుని, వారిలో కళ, క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు యూత్‌ఫెస్ట్ ఉపయోగపడుతుందన్నారు. యూత్‌ఫెస్ట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు వెస్టర్న్, జానపదం డ్యాన్స్‌లు, అలాగే స్పోర్ట్స్‌లో కబడ్డీ, క్రికెట్, షటిల్ ఉంటాయన్నారు. యూత్‌ఫెస్ట్‌ను విజయవంతం చేసేందుకు సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ఆంధ్ర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.రమణమూర్తి, పూర్ణ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ కార్డియాలజిస్ట్ పూర్ణానంద్‌లతో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. యూత్‌ఫెస్ట్ ప్రధాన కార్యదర్శి పి.కృష్ణ మాట్లాడుతూ నగరంలోని విద్యాసంస్థల యజమానులు, యువత, తల్లిదండ్రులు, క్రీడా అసోసియేషన్లు, క్రీడాకారులు, ప్రజానీకం యువజన సంబరాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.నాగేశ్వరరావు, కార్యదర్శి నోహిత్ కృష్ణ పాల్గొన్నారు.

బాల బాలికలలోని ప్రతిభను గుర్తించాలి

విజయవాడ కల్చరల్: బాల బాలికలలోని ప్రతిభను వెలికి తీసి, గుర్తించాల్సిన అవసరముందని సంస్కార భారతి సాంస్కృతిక సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో భరతముని జయంతి సందర్భంగా రెండురోజుల నిర్వహించే రాష్ట్రస్థాయి సంప్రదాయ నృత్య పోటీలను గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ యువత ప్రగతి పథం వైపు నడుస్తోందన్నారు. వారిలోని ప్రతిభను వెలికితీసి వారిని సంస్కారవంతమైన యువతగా తీర్చిదిద్దేందుకు సంస్కార భారతి కృషి చేస్తోందన్నారు. సంస్కార భారతి మహానగర్ (విజయవాడ) అధ్యక్షుడు భాస్కర శర్మ మాట్లాడుతూ భారతీయ నాట్యశాస్త్రలకు ఆదిపురుషుడు భరతముని అని, ఆయన రచించిన నాట్య శాస్త్రం ప్రామాణిక గ్రంథంగా అభివర్ణించారు. భరతముని జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. నాట్యాచార్యుడు పిళ్లా ఉమామహేశ్వర పాత్రుడు, వై అనురాధ, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. సంస్కారభారతి నగర కార్యదర్శి సీతారత్నం పాల్గొన్నారు.

ప్రలోభాలతో చిచ్చుపెడుతున్న చంద్రబాబు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రెడ్డి ప్రజాప్రతినిధులను ప్రలోభాలతో లొంగదీసుకుని చిచ్చుపెట్టి సమాజంలో అలజడులు సృష్టించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెడ్డి ప్రజాప్రతినిధులు చంద్రబాబు ట్రాప్‌లో పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. రెడ్ల వైఖరిపై అరాచక ధోరణితో ప్రవర్తిస్తున్న టీడీపీలో రెడ్లు ఇమడలేరనే విషయం తెలుసుకోవాలని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబు రెడ్లను అణగదొక్కిన నేపథ్యంలో టీడీపీ నుంచి ఒక్క రెడ్డి కూడా ఎమ్మెల్యేగా గెలవలేదని, ఆ పార్టీ ఆవిర్భావం నుంచి ఇలాంటి ఘటన ఎప్పుడూ జరగలేదని గుర్తుచేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సుమారు 350 మందికి పైగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఫ్యాక్షన్ ను పూర్తిగా నిర్మూలించి శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇస్తుంటే చంద్రబాబు మాత్రం రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించేందుకు ఆజ్యం పోస్తున్నారని మండిపడ్డారు. రెడ్డి ప్రజాప్రతినిధులు చంద్రబాబు చరిత్రను గమనించి ప్రలోభాలకు లొంగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

వీఎంసీ ఆధ్వర్యంలో వాల్‌ఆఫ్ కైండ్‌నెస్

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛ సర్వేక్షన్-2023లో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ''వాల్ అఫ్ కైండ్ నెస్''ను ప్రారంభిస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు ఆయన వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో వాల్ ఆఫ్ కైండ్ నెస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్ కైండ్ నెస్ అనేది స్వచ్ఛంద దాన కార్యక్రమమని, ఇక్కడ నగరవాసులు తమ వద్ద ఉన్న పాత, వాడని లేదా దానం చేయాలి అనుకున్న వస్త్రాలు, పుస్తకాలు దానం చేయొచ్చన్నారు. అలంకార్ సెంటర్ అన్నా కాంటీన్ వీఎంసీ మెయిన్ ఆఫీసులో దానం చేసిన వస్తువులు పొందుపరుస్తామన్నారు. వివరాలకు 80198 39112, 86390 91361ను, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగాంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పేజీలను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మరియమాతకు ప్రత్యేక స్థానం

గుణదల(విజయవాడ తూర్పు): మరియమాత పవిత్రతను బట్టీ స్త్రీ లందరిలో ఆమెకు ప్రత్యేక స్థానం ఇచ్చారని పునీత యోహాను ప్రాంతీయ గురు విద్యాలయం అధ్యాపకులు ఫాదర్ కుర్మా తోమస్ అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ప్రార్థనలకు సంబంధించి శనివారం ఆరాధనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక రక్షకుని తల్లిగా మరియమాత భక్తుల నీరాజనాలందుకుంటుందని పేర్కొన్నారు. ప్రభువైన క్రీస్తు ద్వారా ఈ లోనికి పాప క్షమాపణ లభించిందన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. అంతకు ముందు పుణ్యక్షేత్ర గరువులు, పలు విచారణ విశ్వాసులు కొవ్వొత్తులు చేతబూని మరిమాత స్వరూపం వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్, ఫాదర్ కొలకాని మరియన్న, ఫాదర్ సునీల్ రాజు పాల్గొన్నారు.



సమష్టి దివ్యబలి పూజ సమర్పిస్తున్న ఫాదర్ తోమస్

స్కిల్ డెవలప్‌మెంట్ భవిష్యత్‌కు పునాది

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్కిల్ డెవలప్‌మెంట్ విద్యార్థుల భవిష్యత్‌కు మంచి పునాది అని నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎ.విజయబాబు అన్నారు. ఇక్కడ నేర్చుకున్న విద్యతో భవిష్యత్‌లో అద్భుతమైన విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. నలంద విద్యానికేతన్ సెకండరీ విభాగంలో 9,11 తరగతి విద్యార్థులు, 10, 12 తరగతుల వారికి శనివారం వీడ్కోలు సభ నిర్వహించారు. బెంజి సర్కిల్ సమీపంలోని జ్యోతి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు 12 ఏళ్ల పాటు తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించిన తీరు, అనుభవాలను జూనియర్స్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాదల పద్మజ ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొని, తిరిగి పాఠశాలకు వచ్చిన ఉషాహాసినికి ఘనంగా స్వాగతం పలికారు. సీబీఎస్‌ఈ బోర్డు పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు శుభాశీస్సులు అందజేశారు.



విద్యార్థిని అభినందిస్తున్న విజయబాబు, పద్మజ

జీఎస్టీ రాకతో కాస్ట్ అకౌంటెంట్లకు డిమాండ్



మాట్లాడుతున్న శంకర్ పీ పణికర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): జీఎస్టీ రాకతో కాస్ట్ అకౌంటెంట్లకు అవకాశాలు పెరిగాయని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా రీజినల్ కౌన్సిల్ చైర్మన్ శంకర్ పీ పణికర్ అన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో విజయవాడలో శనివారం రాష్ట్రస్థాయి సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ) స్టూడెంట్ల సమావేశం జరిగింది. పలు ప్రాంతాలకు చెందిన ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు వెయ్యి మందికి పైగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథి శంకర్ పీ పణికర్ మాట్లాడుతూ దేశంలో సీఎంఏ మంచి గుర్తింపు ఉన్న కామర్స్ ప్రొఫెషనల్ కోర్సని పేర్కొన్నారు. సీఎంఏ పూర్తి చేసిన వారికి దేశవిదేశాల్లో అత్యధిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. సీఎంఏ కోర్సును మూడు స్థాయిల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఇంటర్మీడియట్ కామర్స్‌లో చేరి, సీఎంఏ కోర్సు చేస్తే బీకాం సెకండియర్‌తో పాటు, సీఎంఏ పూర్తి చేయవచ్చని సూచించారు. ఇంటర్మీడియెట్ తర్వాత బీకాంతో పాటు, మూడేళ్లలో సీఎంఏ పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. బీకాం తర్వాత సీఎంఏలో చేరితే 18 నెలల్లో పూర్తి చేసే అవకాశం ఉందన్నారు.